క్లుప్తంగా

ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు

- నూతన హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరించిన డీఈఈ దివాకర్‌రెడ్డి

కణేకల్లు: హెచ్చెల్సీ ఆయకట్టుకు సక్రమంగానీరందించేందుకు కృషి చేస్తామని కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ నూతన డీఈఈ దివాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక హెచ్చెల్సీ కార్యాలయంలో డీఈఈగా దివాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్, విడపనకల్లు మండలాల్లోని ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందేలా చూస్తానన్నారు. చివరి ఆయకట్టుకు నీటి సరఫరా విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతి అనుసరించి, చివరి ఆయకట్టుకు నీరు చేరేలా చూస్తానన్నారు. నీటి సరఫరా అవాంతరాలు కలగకుండా డిస్ట్రిబ్యూటరీలతోపాటు ఫీల్డ్‌ఛానల్‌ను బాగు చేయిస్తానన్నారు. నూతన డీఈఈకి జేఈలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

సంగమేశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.80 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కింపును పరిశీలిస్తున్న పర్యవేక్షణాధికారి, ఈఓ

కూడేరు: ప్రసిద్ధిగాంచిన కూడేరు శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం రథోత్సవం సందర్భంగా భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన నగదు లెక్కించారు. దేవదాయ శాఖ అధికారి వన్నూరు స్వామి లెక్కింపును పర్యవేక్షించారు. రూ.3,80,594 హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్ బాబు తెలిపారు. ఆలయ అర్చకులు మహేష్, జీర్ణోద్ధారణ కమిటీ సభ్యుడు ప్రవీణ్, సిబ్బంది సాయినాథ్, సునీత, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ఉరవకొండ రూరల్: బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యురాలు పావని తెలిపారు. గురువారం రాకెట్ల పీహెచ్‌సీలో బాల్య వివాహాలు, పీసీపీఎన్‌డీ చట్టంపై అవగాహన కల్పించారు. వైద్యు రాలు పావని మాట్లాడుతూ బాల్య వివాహాలతో అనేక అనర్థాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేఖర్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఇన్ఫినిటీ సంస్థ' సేవలు ఎనలేనివి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే సురేంద్ర బాబు

కళ్యాణదుర్గం రూరల్: ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే సురేంద్ర బాబు అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీవాసవీ కళ్యాణ మంటపంలో ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన మోడల్ డీఎస్సీ పరీక్ష ఫలితంలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మోడల్ డీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు మొదటి ర్యాంకు నుంచి 50 ర్యాంకు వరకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతికి రూ.20 వేలు, చివరి బహుమతి రూ.1000 అందించారు. అనంతరం ఎమ్మెల్యే, డీఎస్పీ రవి బాబు మాట్లాడారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



చాబాలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివాజీరెడ్డి తదితరులు

వజ్రకరూరు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీఓ శివాజీరెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని చాబాల గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగరాజు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు

శెట్టూరు: మండల కేంద్రంలోని యాటకల్లు గ్రామ సచివాలయంలో ఈనెల 10 నుంచి 13 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు ఉంటుందని ఎంపీడీఓ జిలాన్ బాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగురోజుల పాటు క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 0 నుంచి 6 ఏళ్లలోపు పిల్లల ఎన్‌రోల్‌మెంట్ , ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల పిల్లలకు బయోమెట్రిక్ సేవలు అందించనున్నట్లు తెలిపారు.

కరెంటు కోత.. ఉక్కపోత





- ఎడాపెడా కోతలతో దోమల మోత
- చినుకు పడినా, గాలివీచినా గాడాంధకారం
- అవస్థలు పడుతున్న ప్రజలు

రాయదుర్గం: విద్యుత్ కోతలతో గ్రామాల్లో గాడాంధకారం అలుముకుంటోంది. రాత్రివేళ గంటల తరబడి కరెంటు కట్ చేయడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం 5 నుంచి 6 గంటల పాటు విద్యుత్ ఉండని పరిస్థితి. పట్టణాల్లోనూ ఇలాంటి ఇబ్బందులే ఉన్నాయి. ఇంట్లో ఉంటే ఉక్కపోత.. ఆరుబయటకు వస్తే దోమల మోత అన్నట్లుంది జనం పరిస్థితి..రాత్రిళ్లు జాగారం చేయాల్సి వస్తోంది.

రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రిలోనూ విద్యుత్ కోతల సమస్య వేధిస్తోంది. రోగులు, వారి సహాయకులు నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. నాలుగు రోజుల క్రితం రాత్రి ఏడు గంటలు దాటగానే ఉన్నట్టుండి ఆస్పత్రి మొత్తం చీకటి మయమమైంది. దీంతో రోగులంతా జాగరణ చేయాల్సి వచ్చింది. రాత్రంతా గాలి లేక, దోమలు పోరు తాళలేక విలవిలలాడిపోయారు. ఆ మరుసటి దినం కరెంటు సరఫరా పునరుద్ధరించడంతో ఊపిరి వచ్చినట్లయ్యింది. గాలీ, వాన వచ్చిందంటే చాలు గ్రామాలన్నీ అంధకారంలోకి వెళ్తాయి. వర్షం తగ్గినా కొన్ని గ్రామాలకు సరఫరా పునరుద్ధరిస్తారో లేదో తెలియని పరిస్థితి. ఇలా అన్నిచోట్లా సమస్య ఇలానే ఉంటోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 76,410 వ్యవసాయం, 1,81,364 గృహాలు, వాణిజ్యం, పరిశ్రమలకు 33/11 కేవీ నుంచి 59 విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా జరుగుతోంది. చాలా చోట్ల అనధికారిక విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. ఎడాపెడా కోతలతో జనం అల్లాడిపోవాల్సి వస్తోంది. వర్షాకాలం ఆరంభంలోనే ఇలాంటి చిక్కులు ఎదురైతే వర్షాల తీవ్రత మరింత ఎక్కువైతే ఎలాంటి కష్టాలు అనుభవించాల్సి వస్తోందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 15 మండలాలో 10 మండలాలకు పైగా ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కింది స్థాయి సిబ్బంది పోస్టులు కూడా 70 నుంచి 80 శాతం ఖాళీలు ఉన్నాయి. విపత్తులు ఎదురైనప్పుడు సకాలంలో విద్యుత్ బల్బులు వెలిగించడం సాధ్యం కావడం లేదు. ప్రైవేట్ వర్కర్లతోనే నెట్టుకొస్తున్నారు. ప్రజలు ఎన్ని కష్టాలు అనువిస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

విద్యుత్ కోతలు తగ్గించాం

పగలు, రాత్రి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు తలెత్తడం లేదు. వాన, గాలుల బీభత్సవానికి కొన్ని చోట్ల సరఫరాలో అంతరాయం ఏర్పడినా వెంటనే పునరుద్ధరణ జరిపేలా చర్యలు చేపట్టాం. మెయిన్ సప్‌లైల్లో సమస్య ఉన్నప్పుడు మాత్రమే అంతరాయం కలుగుతుంది. ఆ తర్వాత ఎలాంటి కోతలు ఉండటం లేదు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్టు మా దృష్టికి వస్తే సత్వరమే సమస్య పరిష్కరిస్తాం.

– రాజశేఖర్, విద్యుత్‌శాఖ ఈఈ, కళ్యాణదుర్గం

ఆర్డీటీని కాపాడుకుంటాం

- ప్రభుత్వ అడ్డంకులు అధిగమిస్తాం
- రాజకీయ ప్రయోజనాల కోసం పాదయాత్ర చేయడం లేదు
- మాజీ ఎంపీ తలారి రంగయ్య


సేవ్ ఆర్డీటీ పాదయాత్రలో గిరిజన మహిళల సాంప్రదాయ నృత్యం


కుర్లగుండలో ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు మద్దతు తెలుపుతున్న మహిళా కూలీలు

బ్రహ్మసముద్రం: కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా తన పాదయాత్ర ఆగదని, ఆర్డీటీని కాపాడుకోవడమే లక్ష్యమని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య స్పష్టం చేశారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆయన చేపట్టిన 'మహా పాదయాత్ర' రెండో రోజు శుక్రవారం బ్రహ్మసముద్రం మండలంలో సాగింది. ఈ సందర్భంగా మండలంలోని బొమ్మగానిపల్లి తండా, బొమ్మగానిపల్లి, రాయలదొడ్డి, కన్నేపల్లిల్లో రంగయ్యకు స్థానికులు ఆత్మీయ స్వాగతం పలికారు. గిరిజన మహిళలు సాంప్రదాయ నృత్యం చేస్తూ మద్దతు చాటారు. పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. తలారి రంగయ్య ఎంపీగా ఉన్నప్పుడు ఎంపీ ల్యాడ్స్ నిధులతో బోరు వేయించి మోటార్‌ను బిగించారని, దీంతో తండాలో తాగునీటి సమస్య తీరిందని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ ఆర్డీటీ కోసం పాదయాత్ర చేస్తుంటే పోలీసులు అడ్డుకుని విరమించుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. పోలీసులతో పోరాడి ప్రజల మద్దతు ఇవ్వడంతో యాత్ర ముందుకు సాగిందని గుర్తుచేశారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకుండా కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. తాను రాజకీయాల కోసం ఈ కార్యక్రమం చేపట్టలేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్డీటీని మూసివేస్తే దళిత, గిరిజన, చిన్నారులకు ఎన్నో సమస్యలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ పాదయాత్రకు మాజీ మంత్రి శైలజానాథ్ కుమారుడు, శింగనమల నియోజకవర్గ పార్టీ నేత రిత్విక్ హృదయ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేతలు మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధర, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు రేవన్న గౌడ్, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, వివిధ అనుబంధ విభాగాల జిల్లా కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, గోపాల్ రెడ్డి, మహేశ్ స్వామి, జీవీఎస్‌ఎస్ వ్యవస్థాపకులు శివశంకర్ నాయక్, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్, తాలూకా వాణిజ్య విభాగం పాతలింగప్ప, తాలూకా కార్మిక సంఘం అధ్యక్షులు సంజీవయ్య, రైతు సంఘం అధ్యక్షులు అభిలాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు చెలిమేపల్లి ఆంజినేయులు, అశోక్ రెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, తాలూకా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి, తాలూకా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు సునీత, వివిధ మండలాల కన్వీనర్లు గోళ్ల సూరి, సుధీర్, ఎంఎస్ రాయుడు, హనుమంతరాయుడు, జీహెచ్ రాయుడు, ఎంపీపీలు నాగరాజు, ఆంజినేయులు, భీమేష్, సర్పంచులు శంకరప్ప, ఆదినారాయణరెడ్డి, రామ్మోహన్, మల్లేశు, ఎంపీటీసీలు తిప్పేస్వామి, బుశప్ప, నరసింహులు, మురళి, రామాంజినేయులు, మల్లికార్జునలతో పాటు వందలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభకార్యం


వజ్రకరూరులో వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: మండల కేంద్రంలో రాకెట్ల నాగేంద్రమ్మ, నాగన్న దంపతుల కుమారుడు రాకెట్ల రమేష్, కట్ల లక్ష్మీదేవి, కట్ల రాము దంపతుల కుమార్తె సంధ్య వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే ఆశీర్వదించి వివాహ శుభాకంక్షలు తెలిపారు.మాజీఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీనియోజకవర్గనాయకులురాకెట్లఅశోక్,రాజేష్,వజ్రకరూరుసర్పంచుమో నాలిసా,మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి ఉస్మాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రవి కాంతరెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు రామానాయుడు, పార్టీమండల ఉపాధ్యక్షుడు రాకెట్లబాబు, కిసాన్‌సెల్ కార్యదర్శి రఘుపతి, యువజన విభాగం కార్యదర్శి ఎద్దాటి రమేష్, ఎస్సీసెల్ నాయకుడు కిరణ్‌కుమార్, బీసీ సెల్‌నాయకుడు బెస్త ఆది తదితరులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆమిద్యాలలో..

ఉరవకొండ రూరల్: ఆమిద్యాల వైఎస్సార్‌సీపీ సర్పంచు శ్రీరాములు కుమార్తె శ్రావణి, పవన్‌కుమార్ వివాహం గురువారం కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆమిద్యాల రాజేష్, తేజోనాథ్, చాబాల గ్రామ సర్పంచి మల్లెల జగదీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆమిద్యాల మల్లప్ప, పార్టీ నాయకులు రాకెట్ల నాగరాజు, ఆమిద్యాల దాదా పాల్గొన్నారు.

కణేకల్లులో..


వివాహ వేడుకలో పాల్గొన్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: కణేకల్లులోని ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన మాల్యం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతప్ప కుమారుడు రాము పల్లవి వివాహ వేడుకల్లో నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వివిధ విభాగాల నేతలు ఉషారాణి, ఆదిసద్గురు చంద్రశేఖర్ రెడ్డి, హళ్లి నాగరాజు, మర్రేగౌడ్, చిన్న సర్మస్, సుధాకర్, బాషా, చంద్ర, వన్నూరుస్వామి, నాగరాజు, తరకాసి తిప్పేస్వామి పాల్గొన్నారు.

'ఆదర్శ'లో మిగులు సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్ ప్రారంభం

ఉరవకొండ: ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతితో పాటు 7,8,9 ఇంటర్మీడియెట్‌లో మిగులు సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని చిన్నముష్టూరు ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ప్రశస్తకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడానికి ఈనెల 5 నుంచి 20 వరుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో 10 నుంచి 20 వరుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు ఈనెల 24న కౌన్సిలింగ్ ఉంటుందని, ఎంపికైన విద్యార్థుల జాబితాను 25న విడుదల చేసి, 26న ధ్రువపత్రాలు పరిశీలిస్తామన్నారు.

భూ అభివృద్ధి పనులు సద్వినియోగం చేసుకోండి

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంట, అప్పిలేపల్లి పంచాయతీల్లో సెంట్రల్ కలెక్షన్ ఫర్ డెవలప్‌మెంట్ (సీసీడీ) సంస్థ పర్యవేక్షణలో చేపట్టే పలు భూఅభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ మేనేజర్ నటరాజ్ తదితరులు సూచించారు. గురువారం పైరెండు పంచాయతీల్లో రైతు పొలాలకు ఉచితంగా చెరువు మట్టి నింపడం, రైతులు పండించిన వివిధ రకాల పండ్లు, కూరగాయలను మార్కెట్ ధరలకే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అతావుల్లా, ఫీల్డ్ అసిస్టెంట్ మోగానంద, టెక్నికల్ అసిస్టెంట్ ఎరిస్వామి రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక ప్రశాంతత


వజ్రకరూరులో బహుమతులు అందించిన దృశ్యం


బొమ్మనహాళ్‌లో బహుమతులు అందిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: పుస్తక పఠనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్డీటీ ఏటీఎల్ నాగరాజు, గ్రంథాలయ అధికారి బాబుప్రసాద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పద్యాలు, కథలు, చిత్రలేఖనం, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించి,బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దోహదపడిన సమ్మర్ క్యాంపు

కూడేరు: పిల్లల విద్యా, వ్యక్తిగత అభివృద్ధికి గ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులు ఎంతగానో దోహదపడ్డాయని కూడేరు గ్రంథాలయాధికారిణి రాధారాణి తెలిపారు. గురువారం కూడేరు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. క్యాంపులో నిర్వహించిన డ్రాయింగ్, చేతి రాత, ఆటలు, పాటలు, డ్యాన్సు, వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు గ్రంథాలయాధికారిణి రాధారాణి బహుమతులను ప్రదానం చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

వజ్రకరూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని చక్కగా వినియోగించుకోవాలని వక్తలు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మునెమ్మ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జాతీయ సుభాష్ చంద్రబోస్ అవార్డు గ్రహీత బెంజిమెన్, రీసోర్స్ పర్సన్ మహబుబ్‌బాషా, వలి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కుందుర్పి: స్థానిక శాఖా గ్రంథాలయ కార్యాలయంలో గురువారం కుందుర్పి ప్రాథమికోన్నత విద్యార్థులకు వ్యాసరచన, పుస్తక పఠనం తదితర పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి భాస్కర్ బహుమతలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రామచంద్రప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

8న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఉరవకొండ: స్థానిక గవిమఠం ప్రాంగణంలో ఈనెల 8న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలికంగా దగ్గు, ఆయాసం, ఉబ్బసంతో బాధపడుతున్న వారికి ఉచితంగా శిబిరంలో వైద్య సేవలు అందిస్తారన్నారు. ఉరవకొండ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శుచి, శుభ్రత తప్పని సరి

కూడేరు: వంట ఏజెన్సీ నిర్వాహకులు మధ్యాహ్న భోజన తయారీలో శుచి, శుభ్రత తప్పని సరిగా పాటించాలని మండల విద్యాధికారి మహమ్మద్ గౌస్ సూచించారు. గురువారం కూడేరులోని ఎమ్మార్సీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే వారికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు..కార్యక్రమంలో ఎంఈఓ–2 సాయికృష్ణ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు క్రాస్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన దేవరాజు, దేవమ్మ వీరి కుమారుడు నాగేంద్ర ద్విచక్ర వాహనంపై బళ్లారి వైపు వెళ్తుండగా ప్రైవేట్ బస్సు బళ్లారి వైపు నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్తూ నేమకల్లు క్రాస్ సమీపంలో ఢీకొట్టింది. దీంతో దేవమ్మకు చెయ్యి విరిగింది. ఏడేళ్ల చిన్నారికి కాలు విరిగింది. స్థానికులు వారిని బళ్లారి విమ్స్‌కు తరలించారు. బస్సు డ్రైవర్ పర్యారయ్యాడు. బళ్లారి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితులు తెలిపారు.

ఆవులు, ఒంటెలు వధించడం నేరం

ఉరవకొండ: ఈనెల 7న బక్రీద్ పండుగ నేపథ్యంలో ఆవులు, దూడలు, ఒంటెలను వధించడం నిషేధమని, చట్టరీత్యా నేరమని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గోవిధ నిషేధంపై డీడీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏపీ గోవధ నిషేధం, పశు సంరక్షణ చట్టం 1977 ప్రకారం గోవధను నిషేధించినట్లు తెలిపారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోండి

కూడేరు: ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయకుమార్ సూచించారు. గురువారం కూడేరులోని వ్యవసాయ గోదాములో సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల పంపిణీని అధికారులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఏఈఓ శైలజ, ఎంపీఈఓలు షఫ్రీన్, రాజ్‌కుమార్, షాజియా పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


కణేకల్లు రోడ్డులో మొక్కలు నాటుతున్న దృశ్యం


కూడేరులో మొక్కలు నాటడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న సీడీపీఓ శ్రీదేవి

రాయదుర్గంటౌన్: చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కణేకల్లు రోడ్డు తాగునీటి పథకం ఫిల్టరేషన్ పాయింట్ వద్ద నుంచి ఎంపీసీ లేఅవుట్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, అర్బన్ సీఐ జయనాయక్, ఏఈలు నరసింహులు, ప్రతాప్, మున్సిపల్ మేనేజర్ కిశోర్, వార్డు కౌన్సిలర్లు గౌని లావణ్య, ప్రశాంతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాయదుర్గంటౌన్:పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 28వ వార్డు ఊట్లకుంట పరిసరాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది శుభ్రం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు, మున్సిపల్ డీఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈలు ప్రతాప్, నరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, మెప్మా టీపీవో సుబ్రాయుడు, టీఎంసీ నారాయణరెడ్డి, 27వ వార్డు ఇన్‌చార్జ్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి..

బొమ్మనహాళ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో, నేమకల్లు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఓ రామకృష్ణ, డీటీ శ్యామ్, ఈఓపీఆర్‌డీ దాస్, ఆర్‌ఐ బాలకృష్ణ, సర్పంచ్‌లు పరమేశ్వర, ముక్కన్న, కొత్తపల్లి మల్లికార్జున, గోనేహాళ్ కేశవరెడ్డి, యర్రగుంట వెంకటేశులు, మోహన్‌బాబు, గాలి బసప్ప తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలి


ఉరవకొండ: పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలని ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగప్రసాద్, మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓఆర్‌డీ సతీష్, ఈఓ గౌస్‌సాహెబ్‌ల ఆధ్వర్యంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు మొక్కలు నాటారు. నిస్వార్థ సంస్థ అధ్వర్యంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. నిస్వార్థ ప్రతినిధి వెంకట్ తాడికొండ ఆధ్వర్యంలో విద్యార్థులు, సంస్థ సభ్యులు మొక్కలు నాటారు.

విరివిగా మొక్కలు నాటాలి

కూడేరు: మొక్కలు విరివిగా నాటి, సంరక్షించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. గురువారం ఎంఎంహళ్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ అరుణ, ప్రతం కో ఆర్డినేటర్ రామ్మోహన్, అంగన్‌వాడీ కార్యకర్తలు గంగ, శ్రావణి, పిల్లలు పాల్గొన్నారు.

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని సర్పంచు మోనాలిసా అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం రాగులపాడు గ్రామంలోనూ మొక్కలు నాటి, నీరు పోశారు. కార్యక్రమంలో సర్పంచులు జయేంద్రరెడ్డి, హెచ్‌ఎం స్వర్ణలత, ఏపీఓ లక్ష్మీకాంతబాయి, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, పాల్గొన్నారు.

మద్యం మత్తులో మామ, మరదళ్లపై దాడి


గాయపడిన మహదేవ,మహాలక్ష్మి, భవ్య

రాయదుర్గంటౌన్: మద్యం మత్తులో మామ, మరదళ్లపై అల్లుడు దాడి చేసిన ఘటన పట్టణంలో గురువారం రాత్రి జరిగింది. వివరాలు.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్ ఫస్ట్‌క్రాస్‌కు చెందిన మహదేవ తన కుమార్తె మంజులను కర్ణాటకలోని ఆశోక సిద్దాపుర గ్రామానికి చెందిన నాగేంద్రకు ఇచ్చి వివాహం చేశాడు. వీరికి ఒక కుమార్తె ఉండగా ప్రస్తుతం మంజుల గర్భిణి. తరుచూ గొడవలు పడుతుండడంతో గత ఫిబ్రవరి నెలలో మంజుల పుట్టింటికి చేరుకుంది. ఇప్పటికీ గొడవలు పడుతూనే ఉన్నారు. గురువారం రాత్రి నాగేంద్ర, తన సోదరుడు తిప్పేస్వామితో కలిసి భార్య ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. తన అల్లుడు నాగేంద్ర మద్యం మత్తులో విచక్షణారహితంగా తనతోపాటు తన కుమార్తెలు మహాలక్ష్మి, భవ్యపై రాయితో దాడి చేసినట్లు మామ మహదేవ తెలిపాడు. దాడి చేసిన నాగేంద్ర, అతని సోదరుడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గాయపడిన వీరు రాయదుర్గం ఏరియా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దాడిలో మామ మహదేవ, మరదళ్ల మహాలక్ష్మి, భవ్య గాయపడ్డారు.